
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రంగారెడ్డి

5 జిల్లా వార్తలు

శుక్రవారం 15 ఆగస్టు 2025







కొందుర్గు : ఉత్తరాస్‌పల్లిలో వర్షానికి కూలిన ఇల్లు



మొయినాబాద్: కేతిరెడ్డిపల్లిలో నీట మునిగిన వరిచేను



శంషాబాద్ రూరల్ : సుల్తాన్‌పల్లి కేబీ దొడ్డి వద్ద నీట మునిగిన గులాబీ తోట



షాబాద్ : ఏట్లఎర్రవల్లి ఈసీ వాగు సమీపంలో నీటమునిగిన పత్తి

ఉధృతంగా ప్రవహిస్తున్న చేవెళ్ల మండలంలో దేవరాంపల్లి వాగు



అతలాకుతలం!

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలు జిల్లా ప్రజలను వణికిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వానలకు ఈసీ, మూసీ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. చెరువులు, కుంటలు అలుగుపారుతున్నాయి. జంట జలాశయాలైన గండిపేట, హిమాయత్‌సాగర్ ప్రాజెక్టులు నిండుకుండలను తలపిస్తున్నాయి. హిమాయత్‌సాగర్‌కు భారీ వరద కొనసాగుతోంది. దీంతో అధికారులు తొమ్మిది గేట్లను నాలుగు అడుగుల మేర పైకి ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని జనాలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. హిమాయత్ సాగర్ గేట్లు ఎత్తడంతో బండ్లగూడ జాగీరులోని లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. హిమాయత్ సాగర్ వరద రాజేంద్రనగర్ ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డుపై నుంచి ప్రవహిస్తుంది. దీంతో ఆ రోడ్డును మూసివేశారు. పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలను దారి మళ్లించారు.

జిల్లాను వణికిస్తున్న వానలు

- ఉధృతంగా ప్రవహిస్తున్న ఈసీ, మూసీ
- నిండు కుండలా జంట జలాశయాలు
- పొంగి పొర్లుతున్న వాగులు వంకలు
- హిమాయత్ సాగర్‌కు పోటెత్తిన వరద
- ఓఆర్‌ఆర్ సర్వీసు రోడ్డు మూసివేత
- వరద నీటిలో మునిగిన పంట పొలాలు
- కొందుర్గు, చౌదరిగూడ మండలాల్లో కూలిన ఇళ్లు

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల మండలం దేవరాంపల్లి వాగు, శంకర్‌పల్లి మండలం ఫత్తేపూర్ వాగు, మొయినాబాద్ మండలంలోని వెంకటాపూర్ వాగు, షాబాద్ మండలంలోని తాళ్లపల్లి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జలపాతాలు ప్రకృతి ప్రేమికులను కనువిందు చేస్తున్నాయి. పొంగిపొర్లుతున్న వాగులతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొందుర్గు, చౌదరిగూడ మండలాల్లో పెంకుటిళ్లు నేలమట్టమయ్యాయి. నందిగామ మండలం పిట్టలగూడ శివారులోని చెన్నయ్య చెరువు వరద నీటితో నిండి అలుగుపారుతుంది. అంతిరెడ్డిగూడ, నర్సప్పగూడ మధ్యలో వాగు ఉధృతంగా ప్రవహించింది. ఇప్పటి వరకు చుక్కనీరు లేకుండా వెలవెలబోయిన ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులోకి వరద నీరు వచ్చిచేరుతోంది. కందుకూరు మండలం

మిగతా 8వ పేజీలో...



కొత్తూర్ : పెద్దగుట్టతండా రోడ్డులో సగానికి కొట్టుకుపోయిన బ్రిడ్జి

అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ నారాయణరెడ్డి

ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఆదేశించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అధికారులు బాధ్యతగా పనిచేయాలన్నారు. చెరువులు తెగే పరిస్థితి ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులంతా హెడ్ క్వాటర్‌లో అందుబాటులో ఉండాలన్నారు. కరెంట్ స్తంభాలు వద్ద జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శిథిలావస్థ భవనాల్లో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. పొంగి పొర్లే వాగుల వద్దకు ఎవరూ వెళ్లొద్దన్నారు. భారీ వర్షాలకు ఎక్కడైనా స్తం భాలు, చెట్లు విరగడం, ఇళ్లు కూలితే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ 7993103347, 040-23237416 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

షాద్‌నగర్: భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు షాద్‌నగర్ ఆర్డీవో కార్యాలయంలో జాతీయ విపత్తు కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో సరిత తెలిపారు. ఈ చెరువులు, వాగులు పొంగుతున్నాయని తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకున్నా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. 24గంటల పాటు రెవెన్యూ అధికారులతో పాటు, సిబ్బంది కూడా అందుబాటులో ఉంటారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూం సెల్ నంబర్ 7093086354కు సమాచారం ఇవ్వాలని ఆర్డీవో తెలిపారు.

● ఘనంగా పెద్దమ్మ తల్లి బోనాలు

ఆమనగల్లు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలో గురువారం శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి బోనాలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ వేడుకకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి హాజరయ్యారు. సాయంత్రం మహిళలు పట్టు వస్త్రాలు ధరించి బోనాలతో ర్యాలీగా ఆలయానికి తరలివెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బోనాల వేడుకలో పోతురాజుల విన్యాసాలు, మహిళల పూనకాలు, యువతీ యువకుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో నాయకులు తోట గిరియాదవ్, తోట శ్రీనివాస్, నర్సింహ్మా, జంగయ్య, ఎర్రయ్య, మల్లేశ్, పర్వతాలు, శేఖర్, చంద్రయ్య, శివ, కృష్ణ, సింధు, బందయ్య, రవి, నాయకులు బాలాజీసింగ్, శ్రీనివాస్ గౌడ్, భాస్కర్‌రెడ్డి, జగన్, మండ్లీ రాములు, మానయ్య, శ్రీకాంత్, రవీందర్, కృష్ణనాయక్, వెంకటేశ్, కొండల్ రెడ్డి, అంజి, బాబా, సీఐ జానకి రామ్ రెడ్డి, ఎస్‌ఐ వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.



బోనాలతో తరలివస్తున్న మహిళలు

ప్రభుత్వాలు ప్రజలకు చేసిందేమీ లేదు
ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి 8

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి
పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్‌గౌడ్ 6

అరుదైన గౌరవం

న్యూఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య వేడుకలకు మాల్ పంచాయతీ కార్యదర్శి వైవీ రాజు



యాచారం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో నేడు(శుక్రవారం) జరిగే స్వాతంత్ర్య వేడుకలకు రావాలని ప్రధానమంత్రి కార్యాలయం నుంచి రంగారెడ్డి జిల్లా మాల్ పంచాయతీ కార్యదర్శి వైవీ రాజుకు ఆహ్వానం అందింది. దాంతో ఆయన గురువారమే దేశ రాజధాని న్యూఢిల్లీ వెళ్లారు. యాచారం మండలం మాల్ గ్రామ పంచాయతీ ఇటీవల ఆత్మనిర్భర్ భారత్ అవార్డును ఇటీవల అందుకుంది. అవార్డు కింద పంచాయతీకి కేంద్ర ప్రభుత్వం రూ.కోటి నిధులు ఇచ్చింది. ఈ అవార్డును ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా అందుకున్నారు. దేశ రాజధానిలో జరిగే స్వాతంత్ర్య వేడుకలకు వెళ్తానని కలలో కూడా అనుకోలేదని రాజు తెలిపారు.

ఆధిపత్యం కోసమే బీజేపీ ఓటు చోరీ కుట్ర



ఆమనగల్లులో బీసీ హాస్టల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ మల్లు రవి

ఆమనగల్లు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): దేశంలో ఆధిపత్యం కోసం బీజేపీ సాగిస్తున్న ఓటు చోరీకి అడ్డుకట్టవేయకపోతే ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదమని తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల ఫోరం కన్వీనర్, టీపీసీసీ క్రమ శిక్షణ కమిటీ ఛైర్మన్, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా దేశంలోని ప్రజలంతా గళం విప్పి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సాగిస్తున్న పోరాటంలో కలిసి రావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఆమనగల్లు పట్టణంలో అరబిందో ఫార్మసీ కంపెనీ సీఎస్‌ఆర్ నిధులు రూ.4 కోట్లతో నూతనంగా నిర్మించే బీసీ బాలుర వసతి గృహ భవన నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మల్లు రవి మాట్లాడుతూ బిహార్‌లో ప్రజా వ్యతిరేకతను గ్రహించి ఓటమి ఖాయమని భావించిన బీజేపీ దొంగ ఓట్లతో అధికారంలోకి రావాలని కుట్రలు సాగిస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్ అనుకూల, బీజేపీ వ్యతిరేక ఓటర్లను గుర్తించి ఓటర్ల జాబితాల నుంచి తొలగిస్తున్నారని అన్నారు. ఓటు చోరీపై ఇండియా కూటమి రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తుందని, ఓటుపై పోరు బాటలో దేశ ప్రజలంతా కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ.. ఆమనగల్లును విద్యాహబ్‌గా మారుస్తామన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఆమనగల్లు ప్రాంతం అభివృద్ధిలో వెనుకబాటుకు గురైందని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్లలో ఎక్కడైన పొరపాట్లకు తావిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యేహెచ్చరించారు. ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. అభివృద్ధిని ఓర్వలేకే కొందరు నాయకులు విమర్శలకు ఒడిగట్టారని టీపీసీసీ అధికార ప్రతినిధి బాలాజీ సింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అరబిందో ఫార్మసీ ప్రతినిధులు సదానందరెడ్డి, నిత్యానందరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ కేశురామ్, మార్కెట్ ఛైర్‌పర్సన్ యాట గీతానర్సింహ, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, తహసీల్దార్ లలిత, మార్కెట్ వైస్ ఛైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, మాజీ మార్కెట్ వైస్ ఛైర్మన్ గుర్రం కేశవులు, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి మదుసూదన్‌రెడ్డి, జక్కు అనంతరెడ్డి పాల్గొన్నారు.

ఫోర్జరీ చేసి కాజేస్తున్నారు!

● డ్వాక్రా సంఘాల సొమ్ము స్వాహా ● బ్యాంకు నుంచి నిధులు డ్రా ● డీఆర్‌డీఓ ఏపీడీ విచారణ

యాచారం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి):

డ్వాక్రా సంఘాల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని నకిలీ తీర్మానాలు, ఫోర్జరీ సంతకాలతో విలేజ్ బుక్ కీపర్ బ్యాంకు నుంచి నిధులు డ్రా చేస్తున్నారు. గతేడాది యాచారం ఎస్‌బీహెచ్‌లో మల్కీజ్‌గూడ గ్రామానికి చెందిన మహిళా సంఘాల పేరుమీద రూ.27 నిధులు డ్రా చేశారు. ఇటీవల చౌదర్‌పల్లిలో రూ.కోటి వరకు నిధులు విలేజ్ బుక్ కీపర్లు ఫోర్జరీ సంతకాలు చేసి నిధులు డ్రా చేసిన సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. దీంతో వివిధ గ్రామాల ఎస్‌హెచ్‌జీ సంఘాల మహిళలు, ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. అయితే డ్వాక్రా సంఘంలో రుణం తీసుకోవాలంటే బుక్ కీపర్లు ముందుగా మైక్రోక్రెడిట్ ప్లాన్ (సూక్ష్మ జీవనోపాధుల ప్రణాళిక) యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఆ తరువాత మండల కేంద్రంలోని సంబంధిత సీసీలకు, ఏపీఎంకు సమాచారం అందుతుంది. మహిళా సంఘాలకు రుణం ఇవ్వాలా.. వద్దా..? అనేది సీసీలు ఏపీఎంలు విచారణ చేయాలి. గ్రూప్ తీర్మానం కూడా ఏపీఎంకు సంఘం సభ్యులు ఇవ్వాలి. వీటిని పరిశీలించిన తరువాత రుణం మంజూరు చేయవచ్చని బ్యాంక్ అధికారులకు ఏపీఎం సూచిస్తారు. బ్యాంక్ అధికారులు కూడా గ్రామంలోని డ్వాక్రా సంఘాల పని తీరును పరిశీలించిన తర్వాత రుణం మంజూరు చేస్తారు. కాగా, ఈ నిబంధనలేవీ పాటించకుండా డబ్బు డ్రా చేయడానికి అనుమతి ఎలా ఇచ్చారని మహిళా సంఘాల సభ్యులు

మిగతా 8వ పేజీలో...



సమగ్రంగా విచారణ చేయాలి



బ్యాంక్ అధికారుల తీరుపై ఉన్నతాదికారులు సమగ్ర విచారణ చేపట్టాలి. బ్యాంక్‌లో డబ్బు మాయం కావడం విడ్డూరంగా ఉంది. బుక్‌కీపర్లను నమ్మి డ్వాక్రా సంఘాల నిబంధనలు పాటించకుండా డబ్బును ఎ లా తీశారో విచారణ చేయాలి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి.

- సుకన్యబాషా, మాజీ ఎంపీపీ, యాచారం

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

ముస్తాబైన కలెక్టరేట్

జాతీయ జెండాను ఆవిష్కరించనున్న వేం నరేందర్‌రెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 14 : (ఆంధ్రజ్యోతి) : 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు కొంగరకలాన్‌లోని కలెక్టరేట్ ముస్తాబైంది. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. వీఐపీలు, అధికారులకు, మీడియా, ఇతరులకు సీటింగ్ ఏర్పా టు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 9.30 గంటలకు ముఖ్యమంత్రి సలహాదారు (ప్రజా వ్యవహారాలు) వేం నరేందర్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. 9.35 గంటలకు పోలీసు గౌరవ వందనం స్వీకరించనున్నారు. తర్వాత 9.40 గంటలకు ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 10 గంటలకు విద్యార్థులచే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 10.30 గంటలకు స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తారు. 10.45 గంటలకు ప్రభుత్వ శాఖలో అంకిత భావంతో పనిచేసిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేయనున్నారు. వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన 11.30 గంటలకు సందర్శిస్తారు. 11.45 గంటలకు వందన సమర్పణతో కార్యక్రమాలు ముగుస్తాయని కలెక్టర్ తెలిపారు.



పంద్రాగస్టు కోసం కలెక్టరేట్‌లో చేసిన ఏర్పాట్లు

శాస్త్రీయ విధానంలో డెయిరీ నిర్వహణతో లాభాలు


మహిళా రైతులకు పాల ఉత్పత్తులపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు, ఫౌండేషన్ సభ్యులు

షాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ విధానంలో డెయిరీ నిర్వహిస్తే పాడి రైతులు అధిక లాభాలు పొందొచ్చని మాజీ రిజిస్ట్రార్ పశువైద్య విశ్వవిద్యాలయం డాక్టర్ కొండల్‌రెడ్డి, ఫార్మర్ డీన్ ప్రొఫెసర్ రఘునందన్ అన్నారు. గురువారం కక్కులూర్‌లో పీవీనర్సింహారావు తెలంగాణ వెటర్నరీ వర్సిటీ, సేవాస్ఫూర్తి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్ధతిలో డెయిరీ సాగు మరియు పాల ఉత్పత్తుల విలువ జోడింపుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాస్త్రీయ పద్ధతులతో ఆధునిక డెయిరీ ఫారాలను స్థాపించి, పశుపోషణ, ఆవుల గదుల నిర్మాణం తక్కువ పెట్టుబడితో లాభాలు పొందాలన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యాపార నైపుణ్యాల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. డాక్టర్ శివకుమార్, సాహిత్యరాణి మాట్లాడుతూ.. పాల ఉత్పత్తి ద్వారా కోవా, పనీర్, చన్నా, రసమలై, బసుందీ, మజ్జిగ, లస్సీ, ఫ్లేవర్‌మిల్క్ వంటి విలువ ఆధారిత పాల ఉత్పత్తుల తయారీపై రైతులకు వివరించారు. అనంతరం మహిళా పాడిరైతులకు ధ్రువీకరణ ప్రతాలందజేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి స్రవంతి, ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, మహిళా పాడి రైతులు పాల్గొన్నారు.

రహదారి పనులు వేగవంతం చేయాలి


హైవే అధికారితో చర్చిస్తున్న ఎమ్మెల్యే

పరిగి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నాలుగులైన్ల జాతీయ రహదారి పనులను వేగవంతం చేయాలని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అధికారులకు సూచించారు. నగరంలోని తన నివాసంలో గురువారం ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ నాగేశ్వర్‌రావుతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్ల విషయంలో గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఉన్న కేసు విషయంపై చర్చించారు. కేసు వేసిన వారిని ఒప్పించామని, ఎలాంటి అడ్డంకులు లేకుండా తాము చూస్తామని తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుల నిరసన


రాస్తారోకో చేస్తున్న నాయకులు

పరిగి,ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పోడు భూములను రైతులకు సంఘీభావం తెలిపేందుకు వెళ్ళిన బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ, గురువారం సాయంత్రం పరిగి బస్టాండ్ రోడ్డుపై రాస్తారోకోను నిర్వహించారు. పోడు రైతులు తమ హక్కుల కోసం ప్రజాభవన్‌కు వెళుతున్న వారికి మద్దతుగా నిలిచిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని అరెస్ట్ చేయడం అప్రజాస్వామికని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మునిపిపల్ ఛైర్మన్ అశోక్, సురేందర్, ఆర్.అంజనేయుల ఉన్నారు.

పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలి

శామీర్‌పేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తూంకుంట మున్సిపల్ ప్రజలు తమ ఇంటి వాణిజ్య పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి అన్నారు. దేవరయంజాల్‌లో గురువారం సాద నాగేందర్‌రెడ్డి వాణిజ్య సముదాయాల పన్నులు రూ.3,39,812 చెల్లించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రావన్ కుమార్, బిల్ కలెక్టర్ రాంరెడ్డి, సాద నాగేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి


ఎంపీకి ఆలయ చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

శంకర్‌పల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని మహబూబాబాద్ ఎంపీ బలరామ్‌నాయక్ అన్నారు. చందిప్పలోని మరకత శివాలయాన్ని గురువారం ఆయన దర్శించుకున్నారు. అర్చకులు ప్రమోద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. మరకత శివలింగాన్ని దర్శించుకోవడం తన అదృష్టమన్నారు. శివయ్య స్వామి దీవెనలు ప్రలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. మరోసారి కుటుంబీకులతో వచ్చి స్వామిని దర్శించుకుంటానని తెలిపారు. ఆలయ కమిటీచైర్మన్ గోపాల్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు సదానంద్‌గౌడ్‌లు స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఈర్లపల్లి మాజీ సర్పంచ్ రాజశేఖర్, కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

హర్ ఘర్ తిరంగా విజయవంతం


జెండాలను అందజేస్తున్న అందె బాబయ్య, నాయకులు

షాద్‌నగర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బీజేపీ అధిష్టానం పిలుపు మేరకు చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమం విజయవంతమైందని బీజేపీ నేతలు ప్రకటించారు. గురువారం తిరంగా ఇన్‌చార్జి చెట్ల వెంకటేశ్ నేతృత్వంలో షాద్‌నగర్ రైల్వే స్టేషన్ నుంచి పట్టణ కూడలి వరకు అన్ని వాణిజ్య సముదాయాల్లో జాతీయ జెండాలను పంపిణీ చేశారు. అందె బాబయ్య మాట్లాడుతూ.. ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేదుకు తిరంగా కార్యాక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు హరిభూషణ్,యువ మోర్చా నాయకులు ప్యాట అశోక్, వంశీకృష్ణ, రుషికేష్, కురుమన్న, ప్రవీణ్, మంగాదేవి పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి


రాజ్‌భూపాల్‌గౌడ్‌ను సన్మానిస్తున్న బీజేపీ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి

శంకర్‌పల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్‌గౌడ్ తెలిపారు. నూతనంగా ఎంపికైన శంకర్‌పల్లి మండల, మున్సిపల్ కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా శంషాబాద్‌లోని ఆయన నివాసంలో గురువారం సాయంత్రం కలిశారు. ఈ సందర్భంగా రాజ్ భూపాల్‌గౌడ్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాములుగౌడ్, భయానంద్, వాసుదేవ్, దయాకర్‌రెడ్డి. నాయకులు నర్సింలు, శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన పూజలో ప్రభుత్వ చీఫ్‌విప్

పెద్దేముల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పెద్దేముల్ తండాలో శ్రీవీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దేముల్‌తండాలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి ధారాసింగ్ నూతనంగా శ్రీవీరాంజనేయ స్వామి ఆలయాన్ని నిర్మింపజేశారు. రెండురోజుల పాటు కార్యక్రమాలు జరుగుతున్నాయి. మొదటిరోజు జరిగిన హోమంలో మహేందర్‌రెడ్డి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కరణం పురుషోత్తంరావు, జితేందర్‌రెడ్డి,డీవై.నర్సిములు, ప్రవీణ్‌కుమార్, మాజీఎంపీ టీసీ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

పూడూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): చిన్నబండతండా హనుమాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలన్నారు. దైవదర్శనంతో ప్రశాంతత లభిస్తుందన్నారు. మాజీ ఎంపీపీ మల్లేశం, నర్సింహారెడ్డి, గోపాల్, అంజనేయులు ఉన్నారు.

జలమయం.. కొత్తూర్ అండర్‌పాస్

● వాహనచోదకుల ఇబ్బందులు


కొత్తూర్ అండర్‌పాస్ వద్ద నిలిచిన వర్షపు నీరు

కొత్తూర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఇటీవలి వర్షాలకు కొత్తూర్ సమీప అండర్‌పాస్‌లో నిలిచిన నీటితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నాలుగేళ్ల క్రితం నిర్మించిన అండర్‌పాస్‌లో భారీగా వర్షపు నీరు నిలుస్తుండడంతో వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారుల డిజైన్ లోపంతో తరచూ వాన నీరు నిలుస్తుండడంతో పోలీసులు వాహనాలను దారి మళ్లిస్తున్నారు. వర్షపు నీరు తోడేందుకు మోటార్లను ఏర్పాటు చేసినా అవి పూర్తిస్థాయిలో పనిచేయడంలేదు. ఇటీవల పలు వాహనాలు వర్షపునీటిలో చిక్కుకోవడంతో స్థానికుల సహాయంతో వాటిని బయటకు తీశారు. కొత్తూర్ వై-జంక్షన్‌లో ప్రమాదాలను నివారించేందుకు వై-జంక్షన్ సమీపంలో అండర్‌పాస్ నిర్మించారు. అండర్ పాస్ నుంచి పెద్ద సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. అయితే వానకాలంలో అండర్‌పాస్ మొత్తం నీటితో నిండుతుంది. వాహనదారులు రాత్రిపూట మరిన్ని ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు వర్షపు నీటిని తోడించేందుకు భారీ మోటార్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


గోధుమగూడ వద్ద వాగును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. గురువారం వికారాబాద్ మండలం గోధుమగూడలో పరిశీలించారు. వర్షాలు, వరదల నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, చెరువులు, కాలువల వద్ద వెళ్లరాదని తెలిపారు. రైల్వే బ్రిడ్జి దగ్గర నీటి ప్రవాహం తగ్గే వరకు రాకపోకలను నిలిపివేయాలని అధికారులకు ఆదేశించారు. వాతావరణ శాఖ జిల్లాలో రెడ్ అలర్ట్ ప్రకటించినందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయనతో ఎంపీడీవో వినయ్‌కుమార్, ఎంపీవో దయానంద్, పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయండి


మాట్లాడుతున్న తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

తాండూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా పనిచేయాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ ఆదేశించారు. గురువారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్, ఎంపీడీఓలు తమ యాక్షన్ టీంలు, ఫీల్డ్ ఆఫీసర్లు సిబ్బందిని అప్రమత్తంగా ఉండేలా చూసుకోవాలన్నారు. విద్యుత్, రెవెన్యూ, మున్సిపల్, ఆర్ అండ్‌బీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, పోలీస్ శాఖలు ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి వస్తే ఫంక్షన్ హాల్స్‌ను సిద్ధంచేయాలని ఆదేశించారు. పశువులకు వ్యాధుల రాకుండా వెటర్నరీ డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. పురాతన ఇళ్లు, పాఠశాలలు, హాస్టళ్లను గుర్తించి వాటిని ఖాళీ చేయించాలని సూచించారు. చెరువులు, ప్రాజెక్టుల లీకేజీలుంటే వెంటనే పూడ్చి వేయాలని ఆదేశించారు. గజ ఈతగాళ్లు, ఫిషర్‌మెన్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో కాజ్‌వేల వద్దకు ప్రజలు వెళ్లకుండా బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని, ఎక్కడ సమస్యొచ్చినా రెండు బృందాలు రోప్‌తో సిద్ధంగా ఉంటాయని వివరించారు.

ఉత్సవాలకు రాధాకృష్ణాలయం ముస్తాబు



గుట్టపై రాధాకృష్ణ ఆలయం; కొలువు దీరిన రాధాకృష్ణుల మూలవిరాట్

కడ్తాల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి):మండలంలోని బాలాజీనగర్ తండా సమీప ధనరాశి పర్వతంపై వెలసిన రాధాకృష్ణ ఆలయం గోకులాష్టమి వేడుకలకు ముస్తాబైంది. శుక్రవారం నుంచి నిర్వహించే వేడుకల నిర్వాహకుడు బిచ్యానాయక్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఈ నెల 16న రాత్రి డోలోత్సవం, భజనలు, క్షీరాభిషేకం, సుదర్శన యాగం, 17న ఉట్ల వేడుకలు ఉంటాయని ధర్మకర్త తెలిపారు. సాయంత్రం అమ్మవారికి బోనాలు, తీజ్ వేడుకలు ఉంటాయని, ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాధాకృష్ణుల కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

ప్రొటోకాల్ పాటించకుంటే అడ్డుకుంటాం


విలేకరులతో మాట్లాడుతున్న కండె హరిప్రసాద్

ఆమనగల్లు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ నాయకులు, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రభుత్వ కార్యక్రమాలను పార్టీ కార్యక్రమాల వలె నిర్వహిస్తూ రాజకీయ లబ్ధికి, అధికారి దుర్వినియోగానికి పాల్పడుతున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ జెడ్పీటీసీ కండె హరిప్రసాద్ ఆరోపించారు. ఇకపై అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్‌ను పాటించకుంటే అడ్డుకుంటామని అన్నారు. ఆమనగల్లులోని బీజేపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో బీసీ బాలుర హాస్టల్ భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులే నిర్వహించుకున్నారని ఆరోపించారు. నాగర్‌కర్నూల్ జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ పేరును శిలాఫలకంపై రాయడం ఏమిటని అభ్యంతరం తెలిపారు. అధికారులపై ఎమ్మెల్యే ఒత్తిడి తెచ్చి ఓ మాజీ ప్రజాప్రతినిధి పేరును రాయించారని విమర్శించారు. పీసీబీ మెంబర్ పదవి పోయి ఏడాదైనా అదే హోదాతో బాలాజీసింగ్ పేరును చేర్చడం సరికాదన్నారు. ఈ విషయమై గవర్నర్, కలెక్టర్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేస్తామని హరిప్రసాద్ పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ గోరటి నర్సింహ, మాజీ కౌన్సిలర్లు చెన్నకేశవులు, చెక్కాల లక్ష్మణ్, పద్మప్రశాంత్, రవిరాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

పట్నంలో తిరంగా ర్యాలీ


ఇబ్రహీంపట్నంలో తిరంగా ర్యాలీలో బీజేపీ నాయకులు, విద్యార్థులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు దేశం, సమాజం పట్ల గౌరవంగా మెలగాలని బీజేపీ సీనియర్ నాయకులు ముత్యాల భాస్కర్, నాయిని సత్యనారాయణ అన్నారు. ఇబ్రహీంపట్నంలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి సాధిస్తోందన్నారు. రక్షణ రంగం విషయంలో ప్రభుత్వ చర్యలు దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ముత్యాల మహేందర్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జె.రవీందర్‌రెడ్డి, టి.రాంరెడ్డి, రాఘవేందర్, శ్రీనివాస్, సంతోస్, సురేష్, గోవర్ధన్ పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో.. నేటి నుంచి పవిత్రోత్సవాలు


శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి మహాకుంభప్రోక్షణ, పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు నేతృత్వంలో నేటి నుంచి 20వ తేదీ వరకు ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. రోజూ పూజలు, హోమాలు, విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించి చివరి రోజు సాయంత్రం వేంకటేశవర స్వామి కల్యాణం జరిపిస్తారు. వేంకటేశ్వరుడి విగ్రహాన్ని తిరుమల తిరుపతి శిల్ప కళాశాల నుంచి తెచ్చి 1999 ఆగస్టు 17న పునఃప్రతిష్ఠించారు. 25ఏళ్లు అవుతున్నందున పవిత్రాత్సవాలను నిర్వహిస్తున్నారు.

సాగునీటి వనరులకు జలకళ

చెరువులు, ప్రాజెక్టుల్లోకి భారీగా వరద

అలుగెల్లిన కోట్‌పల్లి, జుంటుపల్లి ప్రాజెక్టులు

అలుగెత్తుతున్న చెరువులు	: 311
75 నుంచి 100 శాతం నిండినవి	: 294
50 నుంచి 75 శాతం నిండినవి	: 371
25 నుంచి 50 శాతం నిండినవి	: 211
మొత్తం చెరువులు	1,187

● మూడడుగుల దూరంలో నందివాగు


అలుగు పారుతున్న ధారూరు మండంలోని కోట్‌పల్లి ప్రాజెక్టు

వికారాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో భారీగా నీరు చేరి చెరువులు, సాగునీటి ప్రాజెక్టులు అలుగెత్తుతున్నాయి. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలో వాగులు, వంకలు మత్తడి దుంకుతునాన్నాయి. జిల్లాలో 1,187 సాగునీటి వనరులుండగా, వాటిలో 311 చెరువులు అలుగెత్తి ప్రవహిస్తున్నాయి. మిగతా చెరువుల్లో 75శాతం నుంచి కనీసం 25శాతం వరకు నీరు చేరాయి. లక్నాపూర్, సర్పన్‌పల్లి, శివసాగర్, అల్లాపూర్, కొంశెట్‌పల్లి, కాక్రవేణివాగు ప్రాజెక్టులు ఇప్పటికే అలుగు పారాయి. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి కోట్‌పల్లి, జుంటుపల్లి ప్రాజెక్టులు నిండాయి. నందివాగు ప్రాజెక్టు మరో ఒకటి, రెండు వర్షాలకు నిండే అవకాశం ఉంది. సర్పన్‌పల్లి ప్రాజెక్టు 18 అడుగులు, శివసాగర్ 9, అల్లాపూర్ 10, కొంశెట్‌పల్లి 8, కాక్రవేణివాగు ప్రాజెక్టు 14.7, కోట్‌పల్లి ప్రాజెక్టు 24, జుంటుపల్లి శ్రీరాముల వారి ప్రాజెక్టు 22 అడుగుల లోతుండగా.. ఇవన్నీ అలుగెత్తాయి. నందివాగు ప్రాజెక్టు పూర్తి నీటి నిలువ 16 అడుగులు కాగా.. 13 అడుగుల మేర నీరు చేరింది.

మత్తడి దుంకిన చెరువులు

వికారాబాద్, నవాబ్‌పేట, ధారూరు మండలాల్లో 152 చెరువులకు 98 చెరువులు అలుగెల్లాయి.పెద్దేముల్, తాండూరు, బంట్వారం మండలాల్లో 104 చెరువులకు 30చెరువులు మత్తడి దూకాయి. మిగతా చెరువుల్లోనూ భారీగా నీరు చేరింది. బషీరాబాద్, యాలాల్ మండలాల్లో 158 చెరువులకు 90 చెరువులు అలుగెత్తి ప్రవహిస్తున్నాయి. కోట్‌పల్లి, మర్పల్లి, మోమిన్‌పేట్ మండలాల పరిధి 165 చెరువులకు గాను 50 చెరువులు అలుగు పారుతున్నాయి. పూడూరు, పరిగి, కులకచర్ల, దోమ, చౌడాపూర్ మండలాల పరిధిలో 401 చెరువులకు గాను 26 చెరువులు అలుగెత్తాయి. కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, దుద్యాల్ మండలాల్లో 207 చెరువులుండగా, 17 చెరువులు అలుగెత్తి ప్రవహిస్తున్నాయి.

రెండు చెరువులకు గండ్లు

ఇదిలా ఉంటే వర్షాలకు సాగునీటి వనరులపై అధికార యంత్రాంగం నిఘా పెంచింది. వరద ఉధృతికి చెరువుల వద్ద ప్రమాదకర ఘటనలు చోటుచేసుకోకుండా సమాచారాన్ని సేకరిస్తున్నారు. చెరువు కట్టలకు గండ్లు పడకుండా జాగ్రత్త పడుతున్నారు. ఇటీవలి వర్షాలకు జిల్లాలో యాలాల, ధారూరు మండలాల్లో రెండు చెరువులకు గండి పడింది.

ప్రజలకు సీఎంఆర్ఎఫ్ కొండంత అండ


లబ్ధిదారులకు ఎల్వోసీ అందజేసిన ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

కొందుర్గు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పేదలకు కొండంత అండగా ఉంటుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి అన్నారు. గురువారం కొందుర్గులో లబ్ధిదారులకు ఎల్వోసీలు అందజేశారు. పేదలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుంటే వారికి వైద్య ఖర్చులను అందించేందుకే సీఎంఆర్ఎఫ్ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని, దీనిని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, ఎం.రవీందర్‌రెడ్డి, రాజేష్‌పటేల్, రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్, నర్సింహులు, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై విద్యార్థులకు అవగాహన


అవగాహన కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు

మొయినాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి):గ్రామీణ భారతాన్ని శక్తివంతం చేయడమే లక్ష్యంగా కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. మొయినాబాద్ పరిధి చిలుకూరు ఎల్ఎస్ఆర్ పాఠశాలతో పాటు మండలంలోని తోలుకట్ట, నక్కలపల్లి, శ్రీరామ్‌నగర్, సజ్జన్‌పల్లి, ఎత్‌బార్‌పల్లి ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు తయారుచేసిన నూతన ఆవిష్కరణలను ప్రదర్శించారు. విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమాజాభివృద్ధికి అవసరమైన ఆలోచనలను ప్రోత్సహించేందుకు ఉన్నత భారత్ అభియాన్ ద్వారా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు అధ్యాపకులు సంయుక్తమోహన్ తెలిపారు. పాఠశాలల హెచ్ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య


కళాశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన అసంపూర్తి పనులు త్వరగా పూర్తిచేయించి వినియోగంలోకి తెస్తామని అన్నారు. జూనియర్ కళాశాలను గురువారం ఎమ్మెల్యే సందర్శించారు. కళాశాల గదులు, ఆవరణ, మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఉన్నత పాఠశాలలో జూనియర్, డిగ్రీ కళాశాలలు కొనసాగుతుండడంతో గదుల కొరతతో ఇబ్బందులు కలుగుతున్నాయని విద్యార్థులు చెప్పారు. విద్యార్థులు చెప్పిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వీలైనంత త్వరగా భవన సమస్యను పరిష్కరిస్తామన్నారు. స్థానికుల సహకారం, ఉపాధ్యాయులు, అధ్యాపకుల పనితీరుపైనే విద్యా సంస్థల మనుగడ ఆధారపడి ఉందన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలను తీర్చి దిద్దాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో పాండు, టీచర్స్ యూనియన్ నాయకుడు కసిరెడ్డి అశోక్‌రెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, వైస్‌చైర్మన్ భాస్కర్ రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గుర్రం కేశవులు, కాలె మల్లయ్య, మండ్లీ రాములు, కె.శ్రీనివాస్‌రెడ్డి, విజయ్, కృష్ణనాయక్, సురేష్, పి.శ్రీకాంత్, టి.రవీందర్, పి.శ్రీశైలం, జగన్, మానయ్య, మల్లేశ్, బాబు, శివకుమార్, శ్రీను, వెంకట్‌రెడ్డి, కుమార్ పాల్గొన్నారు.

రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందించాలి

కొడంగల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఎరన్‌పల్లి శివారులో మెడికల్, వెటర్నరీ కళాశాలల నిర్మాణానికి భూములు ఇచ్చిన కొంత మంది రైతులకు పూర్తి స్థాయి పరిహారం అందించాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్ అన్నారు. ఆయన గురువారం సర్వే నంబరు 19లో రైతులతో కలిసి నిరసన తెలిపారు. ఈ నెల 16న మెడికల్, వెటర్నరీ కళాశాల నిర్మాణంలో భాగంగా శంకుస్థాపనకు సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నారని తెలిసిందని అన్నారు. ఈ ప్రాంత రైతులకు అన్యాయం జరగకుండా పూర్తిస్థాయి పరిహారం అందించాలని, ఆ తర్వాతే పనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు.

రాష్ట్ర మహాసభను విజయవంతం చేద్దాం


పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

షాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర మహాసభను విజయవంతం చేద్దామని పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. గురువారం షాబాద్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. సీపీఐ తెలంగాణ రాష్ట్ర మహాసభలు ఈ నెల 20 నుంచి 22 వరకు కుత్బుల్లాపూర్ ఏరియాలో జరుగుతాయన్నారు. కార్మికులు, పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభులింగం, శ్రీశైలం, సత్తిరెడ్డి, నాయకులు మంజుల, జంగయ్య, రఘురాం, మధు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో యువత కీలకపాత్ర పోషించాలి


తిరంగా ర్యాలీలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం, నాయకులు

శంకర్‌పల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): భారతదేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం తెలిపారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా తిరంగా ర్యాలీని గురువారం శంకర్‌పల్లిలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి చౌరస్తా వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దేశ భక్తిని కలిగి ఉండి దేశసేవలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలని అన్నారు. రాబోయే తరాలకు స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాములుగౌడ్, ప్రతాప్‌రెడ్డి. వాసుదేవ్, శ్రీనివాస్‌రెడ్డి. మున్సిపల్ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి. నర్సింలు, దయానంద్, క్రిష్ణారెడ్డి, బీర్ల సురేష్, బండ వెంకటయ్య, జయరాంరెడ్డి తదితరులు ఉన్నారు.

నేటి నుంచి సిద్ధులగుట్ట సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


వెండికొండ సిద్ధేశ్వరస్వామి ఆలయం


గర్భగుడిలోని శివలింగం

శంషాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): శంషాబాద్‌లోని చారిత్రక వెండికొండ సిద్ధేశ్వరస్వామి(సిద్ధులగుట్ట) ఆలయంలో మూడు రోజుల పాటు జరిగే బ్రహోత్సవాలు నేటి(శుక్రవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతీ శ్రావణమాస చివరి వారంలో ఈ ఆలయంలో 11రోజులు జాతర నిర్వహిస్తారు. 450 సంవత్సరాల క్రితం శంషాబాద్, రాళ్లగూడ, కవ్వగూడ, కొత్వాల్‌గూడ, చుట్టూర 50కిలోమీటర్ల పరిధిలో కరువు ఏర్పడింది. అంతుపట్టని వ్యాధులతో ప్రజలు మృత్యువాతపడ్డారు. అదే సమయంలో కాశీయాత్ర చేసి ఈ ప్రాంతంగుండా వెళ్తున్న సిద్ధుడు అనే మునీశ్వరుడిని ప్రజలు వేడుకోగా రాళ్లగూడ నుంచి కొత్వాల్‌గూడ వరకు మూడు కిలో మీటర్ల దూరం వరకు విస్తరించిన పాలరా తిగుట్టల్లో శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశాడు. ఆ వెంటనే ఈ ప్రాంతంలో నాలుగు రోజులు వర్షాలు కురిశాయి. ప్రజలకు క్రమేనా రోగాలు తగ్గిపోయాయి. సిద్ధుడు ప్రతిష్ఠించి ఆలయం కాబట్టి సిద్ధేశ్వస్వామిగా కొలుస్తున్నారు. శుక్రవారం మహారుద్రాభిషేకంతో ప్రారంభమై 18న అమృతస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయి.

వాగు పరిసరాల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు


లింగంధన సమీపంలో పెద్దవాగు వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య తదితరులు

కేశంపేట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం రాత్రి, గురువారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో పెద్దవాగు ఉధృతంగా పారింది. వాగు పరిసర పాటిగడ్డ, కేశంపేట, లేమామిడి, కాకునూర్, నిర్దవెల్లి, తొమ్మిదిరేకుల, లింగంధన గ్రామాల్లో వాగుదాటే చోట్ల అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇన్‌చార్జీ ఎంపీడీవో కిష్టయ్య గ్రామాల్లో పర్యటించి రక్షణ చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కేశంపేట తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. మూడు రోజులు కంట్రోల్ రూం కొనసాగుతుందని తహసీల్దార్ ఆజం అలీ తెలిపారు. 15వ తేదీ నుంచి 16 వరకు సీనియర్ అసిస్టెంట్ మశ్చేందర్(7799363553), జూనియర్ అసిస్టెంట్ శివ(9398094490), 17న ఆర్ఐ చెన్నకేశవులు(9948044523), రికార్డ్ అసిస్టెంట్ జంగయ్య(9972170411), 18న జూనియర్ అసిస్టెంట్లు మహేశ్, జంగేష్‌లు ఫోన్ నంబర్లు 9442579527, 9848206029లలో అందుబాటులో ఉండి సేలందిస్తారని తెలిపారు.

పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్న ప్రభుత్వం


ఇంటి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వజ్రేశ్‌యాదవ్

ఘట్‌కేసర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తోందని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్ అన్నారు. ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, మహేష్ గౌడ్, రాదాకృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, ఎం వెంకటేష్, ముత్యాలు పాల్గొన్నారు.

హెచ్‌పీఎస్‌కు విద్యార్థుల ఎంపిక


లాటరీ తీసి విద్యార్థులను ఎంపిక చేస్తున్న డీఆర్వో సంగీత

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా గిరిజనాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత సమక్షంలో గురువారం కలెక్టరేట్‌లో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో అడ్మిషన్లకు లాటరీ తీశారు. ఆరు సీట్లలో ముగ్గు బాలికలు, మరో ముగ్గురు బాలురు ఉన్నారు. లంబాడా 4, ఎరుకల 1, ఇతర తెగలకు 1 కేటాయించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, అధికారులు పాల్గొన్నారు.


కొండుర్గు : దెబ్బతిన్న బీటీ రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

అతలాకుతలం!

(ఐదో పేజీ తరువాయి)

సున్నం చెరువు, జైత్వారంలోని నాగిని వారి చెరువు, ఆకుల మైలారంలోని రాంబాయికత్వ చెరువులు వరద నీటితో నిండి అలుగు పారుతున్నాయి. కొత్తూరు మండలం గూడరులో రామయ్య చెరువు అలుగు పారుతోంది. రోజు కురుస్తున్న వానలకు పంట పొలాలోకి నీరు చేరాయి. కొన్ని చోట్ల వరద నీటిలో పత్తి పంటలు మునిగిపోయాయి. గడిచిన 24 గంటల్లో కురిసిన వర్షాలకు జిల్లాలోని కొందర్గులో అత్యధికంగా 103.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మహేశ్వరం మండలంలోని ఇండస్ట్రియల్ పార్కులో 99.5 మిల్లీమీటర్లు, శంషాబాద్ మండలం పెద్దషాపూర్‌లో 94.5 మిల్లీమీటర్లు, బాలాపూర్‌లోని ఎయిర్‌పోర్టు ప్రాంతంలో 92.0 మిల్లీమీటర్లు, మహేశ్వరం మండలం అమీర్‌పేట్‌లో 84.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బాలాపూర్‌లో 95.8 మిల్లీమీటర్లు, కొత్తూరు, కేశంపేటలో 83.0 మిల్లీమీటర్లు, తలకొండపల్లి మండలం వెల్జాల్‌లో 78.5 మిల్లీమీటర్లు, మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లిలో 72.8 మిల్లీమీటర్లు, కేశంపేటలో 71.5 మిల్లీమీటర్లు, చౌదరిగూడం మండలం కాసులబాద్‌లో 66.5 మిల్లీమీటర్లు, షాబాద్ మండలం చందనవెల్లిలో 60.0 మిల్లీమీటర్లు, తాళ్లపల్లిలో 53.0 మిల్లీమీటర్లు, కందుకూరులో 53.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. అదేవిధంగా మొయినాబాద్ మండలం రెడ్డిపల్లిలో 54.8 మిల్లీమీటర్లు, ఆమనగల్లులో 54.0 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది.


కడ్తాల్ : అలుగు పారుతున్న గురువుల కుంట చెరువు


కొత్తూర్ : గూడూర్ గ్రామంలోని అలుగు పారుతున్న రామయ్య చెరువు


కందుకూరు : నిండుకుండలా కొత్తగూడ సున్నం చెరువు


చౌదరిగూడ : గాలిగూడలో వర్షానికి పాక్షికంగా కూలిన ఇల్లు


కేశంపేట : పాటిగడ్డ వద్ద పెద్దవాగు వద్ద కంచెను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆజంఅలీ


ఆదిభట్ల : ఎంపీ పటేల్‌గూడ నుంచి రాచకాల్వ ద్వారా పట్నం చెరువులోకి ప్రవహిస్తున్న నీరు


శంషాబాద్ రూరల్ : కేబీ దొడ్డి ఈసీ వాగు ఉధృతిని పరిశీలిస్తున్న ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్, సీఐ నరేందర్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు సారిక, కృష్ణ

క్రైం కార్నర్

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ దుర్మరణం

కడ్తాల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ కింద పడి డ్రైవర్‌మృతి చెందిన ఘటన కడ్తాల మండలం మక్తమాదారంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఆమంచ కృష్ణయ్య(48) గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో నారుమడి దున్నడానికి వెళ్లాడు. ఈ క్రమంలో పొలం దున్నుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఆమనగల్లు ఏఎంసీ చైర్‌పర్సన్ గీతానర్సింహ, పలువురు నాయకులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

మొయినాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఇంట్లోంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మొయినాబాద్ మున్సిపల్ పరిధి హిమాయత్ నగర్‌లో జరిగింది. యూపీకి చెందిన సురేష్‌బచ్చాప్రసాద్ రెండేళ్ల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి హిమాయత్‌నగర్‌కు వచ్చి పెయింటింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 12న ఉదయం పనికి వెళుతున్నానని ఇంట్లోంచి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. ఆయన భార్య మంజు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డంపింగ్ యార్డు తరలింపునకు మోక్షం


డంప్ యార్డును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

షాద్‌నగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని సోలీపూర్ డంపింగ్ యార్డు తరలింపునకు త్వరలోనే మోక్షం లభించనుంది. ఈమేరకు గురువారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్ మాట్లాడుతూ సోలీపూర్ గ్రామానికి చేరువలో చెత్త డంపింగ్ యార్డు ఉండటం వల్ల గ్రామస్థులు ఏళ్లుగా దుర్వాసనను భరించలేక గ్రామాన్నే వదిలి వెళ్లిపోతున్నారని తెలిపారు. అలాగే డబుల్ బెడ్‌రూమ్‌ల వద్దనే డంపింగ్ యార్డు ఉండటంతో లబ్ధిదారులు వాటిని తీసుకోవడానికి అయిష్టత వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ విషయం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి రావడంతో అక్కడి నుంచి డంపింగ్ యార్డును తరలించేందుకు చర్యలు చేపట్టారని వెల్లడించారు. సోలీపూర్ ప్రజలకు త్వరలోనే శుభవార్త అందుతుందన్నారు. పార్టీ సీనియర్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, అగ్గనూరు బస్వం, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం


బక్కని నర్సింహులుకు విరాళం అందిస్తున్న హర్షవర్ధన్, శశిధర్ గౌడ్

షాద్‌నగర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జానంపేటలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి భక్తులు భారీ విరాళాన్ని అందజేశారు. షాద్‌నగర్ పట్టణానికి చెందిన మణికొండ రంగయ్య గౌడ్ కుమారులు హర్షవర్ధన్ గౌడ్, శశిధర్ గౌడ్‌లు గురువారం వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం రూ.లక్షా రెండువేల నగదును మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులుకు అందజేశారు. ఈ సందర్భంగా బక్కని మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావడం హర్షణీయమని అన్నారు.

సర్దార్‌నగర్‌లో కుక్కల బెడదకు పరిష్కారం

షాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఈనెల 12న మండల పరిధిలోని సర్దార్‌నగర్‌లో వీధికుక్కలు ఏడుగురిని కరిచి గాయపర్చాయి. దాంతో గ్రామస్తులు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి దృష్టికి ఈ విషయం తీసుకెళ్లారు. ఈమేరకు ఆయన స్పందించి సొంతంగా రూ.20 వేలు సమకూర్చగా.. గురువారం జంతు సంరక్షణ సిబ్బంది గ్రామంలో కుక్కలకు వ్యాక్సిన్లు ఇచ్చి పట్టుకొని తీసుకెళ్లారు.

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం


ఆమనగల్లులో జెండా సామగ్రి విక్రయాలు

ఆమనగల్లు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యదిన వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాలతోపాటు అన్ని గ్రామాల్లో శుక్రవారం నిర్వహించే పంద్రాగస్టు వేడుకలకు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రైవేటు సంస్థలకు చెందిన కార్యాలయాల ఆవరణలను త్రివర్ణ తోరణాలతో అలంకరించారు. జెండా పండుగను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు గావించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు కార్యాలయాలతో పాటు ఊరూవాడా కాలనీల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. జెండావిష్కరణకు సంబంధించిన వస్తువులను గురువారం ఆమనగల్లు పట్టణం, కడ్తాలలో అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు కొనుగోలు చేశారు.

నేర పరిశోధనకు సీసీ కెమెరాలు దోహదం


శ్రీధర్, కృష్ణ నాయక్‌లను సన్మానిస్తున్న సీఐ గంగాధర్

కడ్తాల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి):నేర పరిశోధన, చోరీల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహద పడుతాయని సీఐ గంగాధర్ అన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని అన్నారు. కడ్తాల మండలం రేఖ్య తండాకు చెందిన పాత్లావత్ శ్రీధర్ రూ.25 వేలు, పాత్లావత్ కృష్ణనాయక్ రూ.10 వేలు సీసీ కెమెరాల ఏర్పాటుకు చేయూతనందించారు. వారిని సీఐ అభినందించి సత్కరించారు. ఎస్సై వరప్రసాద్, చంద్రశేఖర్, హెచ్‌సీలు రాములు, నాగరాజు, ఏఎస్ఐ బాల్‌రెడ్డి, సీసీ కెమెరాల నిర్వాహణ కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లులో పోచంపల్లి బ్యాంక్ ప్రారంభం



ఆమనగల్లు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలో నూతనంగా పోచంపల్లి బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. ఈమేరకు గురువారం బ్యాంక్‌ను ప్రారంభించారు. కార్యక్రమానికి ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారిలు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఆయా విభాగాలను వారు వేర్వేరుగా ప్రారంభించారు. రైతులకు, యువతకు ఉపాధి కల్పనకు, వ్యాపారులకు, చేతివృత్తుల వారికి బ్యాంకర్లు చేయూతనందించాలని వారు కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఆమనగల్లు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోనాపూర్ మాజీ సర్పంచ్ కడారి యాదయ్య తండ్రి పాపయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం మృతదేహాన్ని బీఆర్ఎస్ ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు నేనావత్ పత్యనాయక్, మాజీ ఎంపీటీసీ సరిత పంతూనాయక్, మాజీ సర్పంచ్ సోనశ్రీను నాయక్‌లు సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుమారులు యాదయ్య, రాజు, కుటుంబ సభ్యులను పరామర్శించారు.


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పత్యనాయక్

ఘనంగా పోచమ్మ, మైసమ్మ బోనాలు


కందుకూరు : కొత్తగూడలో బోనాల ఊరేగింపులో నర్సింహారెడ్డి తదితరులు

కందుకూరు/ఆమనగల్లు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రతీయేటా శ్రావణమాసం సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో జరుపుకునే పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ బోనాలు గురువారం వైభవంగా జరుపుకున్నారు. కొత్తగూడ, కందుకూరు, కటికపల్లి, తదితర గ్రామాల్లో మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఊరేగింపులో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కార్యదర్శులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, ఎంపీటీసీలు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, ఎస్.పాండు, మాజీ సర్పంచ్‌లు ఎస్.మల్లారెడ్డి, బి.నరేందర్‌గౌడ్, ఆర్.యాదయ్య, నాయకులు ఎస్.సురేందర్‌రెడ్డి, ఎస్.శేఖర్‌రెడ్డి, ఎగ్గిడి సత్తయ్య, ప్రశాంత్‌కుమార్, సంజీవరెడ్డి, శేఖర్‌గౌడ్, ఎస్.ప్రకాశ్‌రెడ్డి, ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, తాళ్ల కార్తీక్, ప్రశాంత్‌చారి, తదితరులు పాల్గొన్నారు. ఆమగనల్లు మున్సిపల్ పరిధిలోని విటాయపల్లిలో పోచమ్మ బోనాలను గురువారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం మహిళలు పట్టువస్త్రాలు ధరించి బోనపు కుండలతో పోచమ్మ ఆలయానికి చేరుకొని నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, యువతీ యువకుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పుల నర్సింహ, నాయకులు యాదయ్య, కంబాలపల్లి దశరథం, కంబాలపల్లి సాలయ్య, యాచారం కృష్ణయ్య, సంగెం చెన్నయ్య, వద్ది నిరంజన్, నర్సింహ, నరేశ్, మహేశ్, మల్లేశ్, యాదయ్య, కోవూరు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆమనగల్లు : విటాయిపల్లిలో బోనాల ఊరేగింపు

ఫోర్జరీ చేసి కాజేస్తున్నారు!

(ఐదో పేజీ తరువాయి)

ప్రశ్నిస్తున్నారు. ఫోర్జరీ సంతకాలతో నిధులు డ్రా చేస్తుంటే బ్యాంక్ అధికారులు ఏమి చేస్తున్నారని నిలదీస్తున్నారు. ఖాతాదారులు డబ్బు విత్‌డ్రా చేసే సమయంలో రూల్స్ మాట్లాడే బ్యాంక్ అధికారులు చౌదర్‌పల్లిలో బుక్‌కీపర్ల మాట విని నిధులు డ్రా చేయడానికి ఎలా అనుమతి ఇచ్చారని ఆ గ్రామ డ్వాక్రా సంఘాల మహిళలు తప్పుపడుతున్నారు. రుణం తీసుకున్న మహిళలు పూర్తిగా రుణం చెల్లించినా ఇంకా బాకీ ఉన్నారని ఎలా తమ పాస్‌బుక్‌లో ఎంట్రీ చేశారో అర్థం కావడం లేదని వాపోతున్నారు. బ్యాంక్‌లో బాకీ ఉంటే తిరిగి రుణం ఎలా మంజూరు చేశారని బ్యాంక్ అధికారులను అడుగుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా డబ్బు డ్రా చేసినా బ్యాంక్ ఉన్నతాధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదంటున్నారు.

ఇప్పటికీ రెండు గ్రామాల్లో..

గతేడాది మల్కీజ్‌గూడలో ఫోర్జరీ సంతకాలతో నిధులు డ్రా చేసిన ఉదంతం వెలుగుచూసింది. ఇటీవల చౌదర్‌పల్లిలో రూ.కోటి వరకు డ్రా చేసినట్లు తెలుస్తోంది. ఈ అవకతవకలపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు. అయితే ఈ నిధుల డ్రా పై డీఆర్‌డీఓ ఏపీడీ విచారణ చేపట్టారు.

సొంత డబ్బు రూ.20వేలు ఖాతాలో లేవు



నేను డ్వాక్రా సంఘంలో ఒక్క రూపాయి కూడా బాకీ లేను. నా సొంత బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.20వేలు లేవని అధికారులు చెబుతున్నారు. ఇదెక్కడి న్యాయం. నా ఖాతాలో ఉన్న డబ్బు ఎక్కడికిపోయింది. నా పైసలు నాకు ఇప్పించాలి. లేకుంటే బ్యాంక్‌లో ఆందోళన చేస్తా.

\- ఎస్.వద్మ, చౌదర్‌పల్లి

ప్రభుత్వాలు ప్రజలకు చేసిందేమీ లేదు


బీఆర్ఎస్‌లో చేరిన నాయకులతో ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, కేంద్రంలో 11 ఏళ్ల పాలన అని గొప్పలు చెప్పుకుంటున్న బీజేపీ తెలంగాణ రాష్ట్ర ప్రజల కోసం చేసిందేమీ లేదని ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. గురువారం మండల పరిధిలోని సిరిగిరిపురం గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు ఎన్ని ఎత్తులు వేసినా మహేశ్వరం గడ్డ బీఆర్ఎస్ అడ్డాగానే ఉంటుందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చూపిస్తామన్నారు. రైతు భరోసా నిధులను మహేశ్వరం మండలానికి మొదట్లో రాకుండా చేసిన కాంగ్రెస్ నాయకులకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. తుక్కుగూడ, నాదర్‌గూల్ కేంద్రంగా కొందరు బీఆర్ఎస్‌ను అణిచివేయాలని చూస్తున్నారని, ప్రజలంతా గమనిస్తున్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహేందర్, బాల్‌రాజ్, శివలింగం, బండ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియల్లో మంచిరెడ్డి..

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రాయపోల్ మాజీ సర్పంచ్ గోదల లక్ష్మారెడ్డి అంత్యక్రియలు గురువారం స్వగ్రామంలో జరిగాయి. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచ్ బల్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

వధూవరులకు కేటీఆర్ ఆశీర్వాదం



శంకర్‌పల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన స్నేహితుడు మాణిక్య ప్రభు కూతురు వివాహానికి హాజరయ్యారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన మాణిక్య ప్రభు, కేటీఆర్‌లు నిజాం కళాశాలలో డిగ్రీ కలిసి చదువుకున్నారు. ఈమేరకు గురువారం మాణిక్యప్రభు కూతురు వివాహం శంకర్‌పల్లిలోని కేసీఎం కన్వెన్షన్‌లో జరిగింది. కేటీఆర్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతో పాటుగా బీఆర్ఎస్ నాయకులు కార్తీక్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, పాపారావు తదతరులు వివాహానికి హాజరయ్యారు.

కాంగ్రెస్ నాయకుల ఉదారత

గ్రామంలో వీధి దీపాల ఏర్పాటు

కేశంపేట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొమ్మిదిరేకులలో నెలకొన్న సమస్యను గుర్తించిన కాంగ్రెస్ నాయకులు వీధి దీపాలు వేయించేందుకు ముందుకు వచ్చారు. ఒకరికి ఒకరూ చేయూతనందించుకుని రూ.20 వేలు పోగు చేశారు. ఆ డబ్బులతో గురువారం గ్రామంలో స్ట్రీట్‌లైట్లను వేయించారు. గ్రామంలో విద్యుత్ దీపాల ఏర్పాటుతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బీస కారుణాకర్ రెడ్డి, గుత్తి చంద్రయ్య, శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, నిరంజన్, తదితరులున్నారు.

సీసీ కెమెరాలతో గ్రామానికి భద్రత


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ లక్ష్మీనారాయణ

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలతో గ్రామం భద్రతలో ఉంటుందని షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్‌లో రాయికల్ శ్రీనివాస్ రూ.2లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం ప్రారంభించారు. గ్రామం జాతీయ రహదారి పక్కన ఉండటంతో సీసీ కెమెరాలు ఎంతో ముఖ్యమన్నారు. దాత శ్రీనివాస్‌ను ఏసీపీ అభినందించారు. ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ మాజీ సర్పంచ్‌లు ఆశన్న, కృష్ణయ్య, పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

యాచారం : సైబర్ నేరాల పట్ల ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ అన్నారు. గురువారం సాయంత్రం మీర్‌ఖాన్‌పేటలో సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌చేసి ఓటీపీ, ఆధార్‌కార్డు నెంబర్ చెప్పాలని కోరితే స్పందించవద్దన్నారు. వర్షాలు కురుస్తుండడంతో విద్యుత్ స్తంభాలు తాకరాదన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు మంచినీళ్ల కావాలని మాటలు కలిపి మంగళసూత్రాలు అపహరించే ప్రమాదముందని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆయనతో ఎస్సై సైదులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

ఇబ్రహీంపట్నం : విద్యాజ్యోతి పథకం కింద కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో గురువారం ఇబ్రహీంపట్నంలో పలు పాఠశాలల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఇబ్రహీంపట్నం బాలికల ఉన్నత పాఠశాల, ఆదిభట్ల, కోహెద పాఠశాలలకు చెందిన ప్రతిభావంతులైన 24 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సీఎస్ఆర్ ఆధారిత కార్యక్రమంలో భాగంగా స్కాలర్‌షిప్‌లు అందజేశారు. కెనరా బ్యాంక్ డీజీఎం వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం అక్షయమూర్తి, ఎంఈవో హీర్యా నాయక్ తదితరులున్నారు.

మొయినాబాద్ : కష్టపడి చదివిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని మొయినాబాద్ పీఏసీఎస్ మాజీ చైర్మన్ పి.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. పెద్దమంగళారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 300మంది విద్యార్థులకు షూస్, సాక్సులు అందజేశారు.

ఆమనగల్లు : విద్యార్థినీలు ప్రాథమిక దశ నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని సాధనకు పట్టుదల, ఏకాగ్రత, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని తహసీల్దార్ లలిత అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో పది రోజుల పాటు నిర్వహించిన వాయిస్ ఫర్ గర్ల్స్ కార్యక్రమం గురువారం ముగిసింది. వసతిగృహ అధికారి గోపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి తహసీల్దార్ లలిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిక్షణ పొందిన విద్యార్థినీలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

కందుకూరు : దాసర్లపల్లి మాజీ ఎంపీటీసీ టి.ఇందిర, మాజీ సర్పంచ్ టి.దేవేందర్‌లు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం మ్యాట్స్(కార్పెట్స్)ను అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.